క్లుప్తంగా

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరూ పయనించాలని నజరేతు నాయక్ ప్రేయర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.ధర్మా నాయక్ తెలిపారు. స్థానిక దావు బుచ్చయ్యకాలనీ డొంక రోడ్డులో ఆదివారం సాయంత్రం నజరేతు నాయక్ ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన క్రీస్తు సందేశాన్ని వివరించారు. అనంతరం చిన్నారులు, మహిళలు ఆలపించిన భక్తి కీర్తనలు ఆహుతులను భక్తితత్వంలో ముంచెత్తాయి. విశ్వాసకులకు భోజనాలు పంపిణీ చేశారు.

తూర్పు కాపు విద్యా విజ్ఞాన్ భవన్ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): తూర్పు కాపులు సంఘటితంగా ఉండి అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక 27వ డివిజన్ గులాబీతోటలో తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యా విజ్ఞాన్ భవన్‌ను ఆయన ప్రారంభించారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. తూర్పు కాపులకు తన వంతు సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు కోన శ్రీహరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చింత చిన్నా, న్యాయ సలహాదారుడు కునుకు రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బీమల వెంకట రమణ, కోశాధికారి పిన్నింటి చిన్నరామారావు మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచినేని లలిత, నవనీతం సాంబశివరావు, ఇజ్జాడ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

శృతిలయ సమ్మేళనం రామమూర్తి గాత్రం



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ కళాపీఠం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఎస్.రామమూర్తి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ వాగ్గేయకారులకు సంకీర్తనా గుడికట్టింది. సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కొమ్మాజొస్యుల సద్గురు చరణ్ వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ సంగీత కచేరీ నిర్వహించిన రామమూర్తి సంగీత సేవలను వివరిస్తూ వృత్తిరీత్యా చార్టర్ అకౌంటెంట్ అని, చిన్నతనం నుంచే సంగీతంలో శిక్షణ తీసుకున్నారన్నారు. దేశ విదేశాల్లో కచేరీలు నిర్వహించారని తెలిపారు. సంస్థ కార్యదర్శి సీవీ రావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంగీత విద్వాంసుడు రామమూర్తిని ఆత్మీయంగా సత్కరించారు.

వైభవంగా వెంకన్నకు గరుడ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకొని వెంకన్నస్వామికి గరుడసేవ ఉత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మార్గశిర మాస పౌర్ణమిని పురస్కరించుకొని పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో గరుడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతినెల పౌర్ణమి రోజున స్వామి వారికి గరుడ వాహన సేవను నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గరుడవాహనంపై వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. సహస్రనామార్చనలు చేశారు. భక్తుల గోవింద నామాలు, మంగళవాయిద్యాలు, పండితుల వేదపఠనం, కళాకారుల నృత్యాలతో స్వామివారి గరుడ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారిని ఆలయ ప్రాంగణంలో మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

ఆలయంలో ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు తిరుమంజన అభిషేక కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాలు, సుగంధ ఫలపుష్పాది ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్ని పూజలు చేశారు. వైదిక కార్యక్రమాలను ఆలయ పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షితులు నిర్వహించారు.

శిథిలావస్థలో కర్మల భవనం

- కనీస మరమ్మతులు కరువు
- అధికారుల తీరుతో కార్పొరేషన్ ఆదాయానికి గండి
- వినియోగంలోని తీసుకురావాలని వినతి



సీకే రెడ్డి రోడ్డులోని కర్మల భవనం



అధ్వానంగా ఫ్లోరింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్య నగర్ సీకే రెడ్డి రోడ్డులోని కర్మల భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడూ కార్యక్రమాలతో బిజీగా ఉండే కర్మల భవనం ఖాళీగా ఉంటోంది. ఇక్కడ ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు సైతం నిర్వహించకపోవటంతో కర్మల భవనం అసౌకర్యాలకు నిలయంగా మారింది. మరమ్మతులు నిర్వహించకపోవటంతో ఇక్కడ కర్మకాండలు నిర్వహించుకునేందుకు ప్రజలు ముందుకు రావటం లేదు. ఇక్కడకు వచ్చిన వారు కనీస సౌకర్యాలు సైతం లేకపోవటంతో పక్కనే ఉన్న నాయీబ్రాహ్మణ కమ్యునిటీ హాల్‌లో కార్యక్రమాలు చేసుకుంటున్నారు. దీనివల్ల కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

అసౌకర్యాలకు నెలవు..

కర్మల భవనంలో శ్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. అలాగే భవనంలోని ఫ్యాన్లు మరమ్మతులకు గురికావడంతో పాటు ఫ్లోరింగ్ అధ్వానంగా మారింది. దీంతో ఇక్కడ కార్యక్రమాలు చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇక టాయిలెట్‌లు అపరిశుభ్రంగా దుర్వాసన వెదజల్లుతూ ఉన్నాయి. టాయిలెట్‌లకు కనీసం డోర్‌లు కూడా లేని పరిస్థితి నెలకొంది. వంటశాల సైతం శిథిలమై అధ్వానంగా మారింది. కర్మల భవనం నిర్వహణ సరిగా లేకపోవటంతో శిథిలావస్థకు చేరుకోవటంతో పాటు విషసర్పాలు, క్రిమికీటకాల సంచారం అధికమైంది. పక్కనే ఉన్న ఏలూరు కాలువ పక్క నుంచి విషసర్పాలు, క్రిమికీటకాలు వస్తున్నాయి. వీటి వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



డోర్ లేని బాత్‌రూమ్

ఆదాయానికి గండి..

నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ కర్మల భవనానికి గతంలో డిమాండ్ అధికంగా ఉండేది. ఒక్కో కార్యక్రమానికి రూ.3,700 చొప్పున వసూలు చేస్తున్నారు. అయితే ఇక్కడ వసతులు సక్రమంగా లేకపోవటం వల్ల కార్యక్రమాలు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావటం లేదు. కొద్దిపాటి మరమ్మతులు చేసినా నగరపాలకసంస్థకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వీఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.



సౌకర్యాలు లేవు..

నేను 25 సంవత్సరాలుగా కర్మల భవనంలో పని చేస్తున్నా. గత కొంత కాలంగా మరమ్మతులు చేయకపోవటం వల్ల వచ్చే వారి సంఖ్య తగ్గింది. ఇటీవల ఒక వ్యక్తి వచ్చి ఈ కర్మల భవనాన్ని తాను తీసుకున్నానని మమ్మల్ని ఖాళీ చేయాలని చెప్పి వెళ్లిపోయారు. సౌకర్యాలు లేకపోవటంతో పక్కనే ఉన్న నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌కు వెళ్లిపోతున్నారు. వసతులు కల్పిస్తే వీఎంసీకి ఆదాయం వస్తుంది.

–మానేపల్లి సుబ్బారావు, స్థానికుడు, అయోధ్యనగర్



అధికారులు స్పందించాలి..

ఇక్కడ కర్మల భవనానికి మరమ్మతులు చేయాలని ఇప్పటికే పలుమార్లు అధికారులకు వినతి పత్రం అందజేశాం. అలాగే కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి కౌన్సిల్‌లో సైతం కర్మల భవనంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కానీ ఇప్పటి వరకు పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు నిర్వహించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– గుండే సుందర్‌పాల్, అయోధ్యనగర్

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కృష్ణంరాజు విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులో ప్రముఖ సినీనటుడు కృష్ణంరాజు విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కృష్ణంరాజు సతీమణి శ్యామలదేవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముత్యాలంపాడులో కృష్ణంరాజు విగ్రహం ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చిన సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ సభ్యులను అభినందించారు. ఎమ్మెల్యే బోండా ఉమా సహకారంతో ముత్యాలంపాడులో కృష్ణంరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు డి.మురళీకృష్ణంరాజు తెలిపారు. వేజెళ్ల రాజేంద్రప్రసాద్, అప్పలరాజు, కనకారావు, నున్న నాగేశ్వరరావు, చంటి, రమణ తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు ఎనలేనివి



శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న వీఎంసీ మేయర్ భాగ్యలక్ష్మి



నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

పటమట(విజయవాడతూర్పు): దేశాన్ని ఏకీకృతం చేయటంలో విజయం సాధించిన సర్దార్ వల్లభాయ్ పటేల్, ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావంలో తన ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగాలు ఎనలేనివని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం వీరిరువురి వర్ధంతి సందర్భంగా వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద పొట్టి శ్రీరాములు – సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు, ప్రాంతీయ భాషలు, సంస్కృతులను పరిరక్షించడంలో పొట్టి శ్రీరాములు పాత్ర కీలకమైనదన్నారు. ఆంధ్రుల ఆశయ సాధన కోసం ఆయన చేసిన త్యాగానికి ఆయన మరణాంతరం అమరజీవి అనే బిరుదు ప్రధానం చేశారని తెలిపారు. భారతదేశపు ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలోనే కాకుండా దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాలను చేపట్టారన్నారు. ఇటువంటి మహనీయుల వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకోవటమే కాకుండా భావితరాలకు వారి గురించి తెలియజేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్)డాక్టర్ డి.చంద్రశేఖర్, మేనేజర్ ఏయూబీ శర్మ, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి అమరుడైన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నగరంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడై, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకు జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డాక్టర్ విద్యాసాగర్, సూపర్‌వైజర్లు రాజశేఖర్, సత్యనారాయణరెడ్డి, బాషా, తేజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు నేటి తరానికి ఆదర్శప్రాయుడని గ్రంథాలయాధికారి కె.రమాదేవి అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆత్మార్పణ దినం సందర్భంగా విద్యార్థులకు ఆయన జీవితంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కె.రాంబాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ పాఠకులతో కలిసి అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస అనేవి శ్రీరాములు మార్గాలన్నారు. హరిజనుల దేవాలయాల ప్రవేశం, అస్పృశ్యత నివారణ, సహపంక్తి భోజనాలతో కులతత్వాల నిర్మూలనకు కృషిచేసిన మహనీయులని కొనియాడారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన 58 రోజు నిరాహార దీక్ష ఫలితంగానే 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం సదా స్మరణీయం

విజయవాడకల్చరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం సదా స్మరణీయమని కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. తెలుగు కళావాహిని శ్రీకళాభారతి, కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి రాగసుధామయి క్రియేషన్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం, రాగాల పల్లకీ సీజన్ 7 కార్యక్రమం నిర్వహించారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు మాట్లాడుతూ.. మనం మరచిన నాయకుల్లో పొట్టి శ్రీరాములు ఒకరన్నారు. భావితరాలకు వారి జీవితం వినిపించాలని సూచించారు. శింగంశెట్టి చంద్రశేఖర్, చింతకాయల చిట్టిబాబు, రాష్ట్ర సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.భాస్కర నారాయణ, బోడి ఆంజనేయరాజు ప్రసంగించారు. శ్రీకళాభారతి ప్రచురించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు. రాగమయి సాంస్కృతిక సంస్థకు చెందిన గాయనీ గాయకులు రవికుమార్, శేఖర్, భాస్కర్, పెద్దిరెడ్డి, సురేష్, హర్షమోహన, లక్ష్మి, రూపశ్రీ, పద్మ తదితరులు దేశ భక్తి, క్లాసికల్ గీతాలను ఆలపించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక గులాబీ తోటలో ఆదివారం అమరావతి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన జాతిపిత మహాత్మా గాంధీజీ, అమరజీవి పొట్టి శ్రీరాములు, వాకర్స్ క్లబ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఆళ్వార్ దాస్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం వాకర్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ వాకర్స్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ, కార్పొరేటర్లు కొండాయగుంట మల్లీశ్వరి, వీరమాచినేని లలితతో కలిసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, చిన్నం శ్రీదేవి, ఎస్.ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు బండారు వేంకటేశ్వరరావు, నవనీతం సాంబశివరావు, కేవీ సూరిబాబు, కొండాయగుంట రాము, బోడి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవం పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు తదితరులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కొనియాడారు. అమరజీవి వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సత్యనారాయణపురంలోని అమరజీవి విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తితో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని పొట్టి శ్రీరాములు సాగించిన పోరాటం మరువలేనిదని గుర్తు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం, ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం ఎంతవరకైనా వెళ్లాలన్న ఆయన దృఢ సంకల్పం ఎంతో గొప్పదని అన్నారు. మహాత్మా గాంధీ శిష్యుడిగా జాతీయోద్యమంలో పాల్గొని ఆరు సార్లు జైలుకు వెళ్లారన్నారు. సత్యం, అహింసా, హరిజనోద్ధరణకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. హరిజనులకు ఆలయ ప్రవేశం చేయించిన ఘనత కూడా ఆయనకే దక్కిందన్నారు. ఆయన చేసిన త్యాగాలకు గుర్తుగా మహానేత వైఎస్సార్ హయాంలో నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లాగా పేరు పెట్టారని కొనియాడారు. ఆ మహనీయుని స్ఫూర్తితో ప్రతి తెలుగువాడు ముందుకు సాగాలని విష్ణు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు మైలవరపు రాము, చల్లా సుధాకర్, చల్లాప్రగడ గోపాలకృష్ణ, కంభంపాటి ప్రసాద్, కూనపులి ఫణి, మురళీకృష్ణం రాజు, కొల్లూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు



నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యత



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించటం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ ఆడిటర్, సమీర ఈస్ట్ లయన్స్ కంటి హాస్పిటల్ ట్రస్ట్ సభ్యుడు పి.సుబ్బారాయుడు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం సాయంత్రం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 210 నెలలుగా వయో వృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ట్రస్ట్‌కు అవసరమైన సహాయం అందజేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

ఉచితంగా కంటి శుక్లాల ఆపరేషన్లు

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ బి.హనుమయ్య మాట్లాడుతూ తాము ఇప్పటికే వేలాది మందికి లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ద్వారా కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేశామన్నారు. ఇప్పుడు వృద్ధులకు కూడా సేవ చేయటం సంతోషంగా ఉందని చెప్పారు. వయో వృద్ధ చారిటబుల్ ట్రస్ట్‌లో వృద్ధులకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షులు పీవీడీ ప్రసాద్, డి.గోపీనాథ్ మాట్లాడారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్‌సోలంకీ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు, పి.లక్ష్మీనరసింహరావు, వెంకటేష్, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి



దత్తాత్రేయుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



విశేష అలంకరణలో స్వామివారు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం షిర్డీసాయిబాబా, నాగమానసాదేవి ఆలయంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముక్కోటి దేవతల అవతారంగా భావించే దత్తాత్రేయుడి విగ్రహానికి భక్తులు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులైన త్రిమూర్తుల స్వరూపమే దత్తాత్రేయ స్వామి అని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి అన్నారు. అనంతరం వల్లభదాసు మాధవరావు, విజయలక్ష్మి దంపతులు, కనకమేడల భరత్భూషణ్, శివపార్వతి దంపతులు, వెన్నా రామాంజనేయులు, లక్ష్మీ రమాదేవి దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో దత్త జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఓంకార క్షేత్రం శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

మధురానగర్ ఓంకార క్షేత్రం శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన పారాయణం జరుగుతుందన్నారు.

● ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆరాధ్య అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్‌కు చెందిన యేలేశ్వరపు ఉషా మాధురి ఆధ్వర్యంలో భక్తి సంగీతాన్ని ఆలపించారు. వీరికి మృదంగంపై కిశోర్, వయోలిన్‌పై శ్రీకృష్ణ సహకారం అందించారు. ఆలయ ఈవో రామరావు దంపతులు వారిని అభినందించారు.